ధరల మంట.. కొలువుల తంటా

ధరల కట్టడిలో, ఉద్యోగ కల్పనలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా ఫెయిల్

- నిత్యావసరాల ధరలు తగ్గుతాయన్న ఆశ లేదు
- జీతాలు పెరుగుతాయన్న సూచన లేనేలేదు
- 'ఇండియా టుడే' సర్వేలో ప్రజల మనోగతం



ఇండియాటుడే, సీ-వోటర్ సర్వే

'అచ్చేదిన్ తెస్తాం.. ఏడాదికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇస్తాం' అంటూ పదకొండేండ్ల కిందట అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశ ప్రజలందరూ అరిగోస పడుతున్నారు. ధరల మోతతో సామాన్యుడి బతుకు దిన దిన గండం నూరేండ్ల ఆయుష్షుగా మారింది. పెరిగిన నిరుద్యోగంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతీ, యువకులు సతమతమవుతున్నారు. దీంతో పెరుగుతున్న ధరలకు కళ్లెం వేయడంలో, ఉద్యోగ కల్పనలో మోదీ సర్కారు ఘోరంగా విఫలమయ్యిందంటూ మెజారిటీ ప్రజలు మండిపడుతున్నారు. ఈ మేరకు 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరిట ఇండియా టుడే, సీ-వోటర్ సంయుక్తంగా చేసిన ఇటీవలి సర్వేలో పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): కొండెక్కిన నిత్యావసరాల ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉద్యోగ కల్పన మృగ్యమవ్వడంతో దేశంలోని యువతరమంతా సతమతమవుతున్నది. పదకొండేండ్ల బీజేపీ పాలనలో ధరలు, నిరుద్యోగమే అతిపెద్ద సమస్యలని, వీటిని పరిష్కరించడంలో మోదీ సర్కారు ఘోరంగా విఫలమయ్యిందని తాజాగా తేలింది. ఈ మేరకు 'మూడ్ ఆఫ్ నేషన్' పేరిట ఇండియాటుడే, సీ-వోటర్ సంయుక్తంగా ఫిబ్రవరిలో చేసిన సర్వేలో పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి.

అన్నీ సమస్యలే

దేశ ప్రజలు ఎక్కువగా ఎదుర్కొంటున్న సమస్యలేమిటని సర్వే ప్రతినిధులు ప్రశ్నించగా.. మెజారిటీ ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదల తమకు ఇబ్బందిగా మారినట్టు అభిప్రాయపడ్డారు. 11 ఏండ్ల బీజేపీ ప్రభుత్వ పాలనలో అతిపెద్ద వైఫల్యాలుగా ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి రెండు అంశాలు నిలిచినట్టు ఏకంగా 42 శాతం మంది పేర్కొన్నారు. మత కల్లోలాల నియంత్రణలోనూ, మైనార్టీల భద్రతను చేపట్టడంలోనూ, ఆర్థికాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ బీజేపీ సర్కారు విఫలమయ్యిందని పలువురు అభిప్రాయపడ్డారు.



11 ఏండ్ల బీజేపీ ప్రభుత్వ పాలనలో అతిపెద్ద వైఫల్యాలు ఏమిటి?



మోదీ హయాంలో ఎక్కువగా లబ్ధి పొందిన వారు ఎవరు?

ప్రస్తుతం దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యలేమిటి?

- నిరుద్యోగం- 24%
- ధరల పెరుగుదల – 17%
- ఆదాయలేమి, పేదరికం – 7%
- రైతు సమస్యలు – 7%
- మహిళా భద్రత – 6%

దేశంలో నిరుద్యోగం నిజంగానే అంత తీవ్రమైన సమస్యా?

- చాలా తీవ్రమైన సమస్య – 55%
- తీవ్రమైన సమస్యే – 21%
- అంతపెద్ద సమస్యేం కాదు – 5%
- ఏమీ చెప్పలేం – 19%

పెరిగిన ధరలతో రోజువారీ ఖర్చులను భరించగలుగుతున్నారా?

- చాలా కష్టంగా ఉన్నది – 64%
- కష్టమైనా ఏదోలా బండి లాగుతున్నాం – 27%
- కష్టంగా ఏమీలేదు - 9%

యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ స్కీమ్‌కు మద్దతిస్తామన్నవారు	82%
ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ సర్కారు దుర్వినియోగం చేస్తోంది	45%

రైలు బయలుదేరే 4 గంటల ముందు వరకు బోర్డింగ్ స్టేషన్ మార్పుపై కొత్త సౌకర్యం

న్యూఢిల్లీ, మార్చి 26: రైలు ప్రయాణికులకు శుభవార్త. ప్రయాణికులకు ఒక కొత్త సౌకర్యాన్ని భారతీయ రైల్వే ప్రకటించింది. రైలు బయల్దేరడానికి నాలుగు గంటల ముందు వరకు ప్రయాణికులకు తాము రైలు ఎక్కే(బోర్డింగ్) స్టేషన్‌ను మార్చుకునే వెసులుబాటును రైల్వే శాఖ కొత్తగా కల్పించింది. గతంలో రైలు బయల్దేరడానికి కనీసం 24 గంటల ముందు మాత్రమే బోర్డింగ్ స్టేషన్‌ను మార్చుకునే అవకాశం ఉండేది. అదనపు చార్జీ చెల్లించకుండా ప్రయాణికులు తమ బోర్డింగ్ పాయింట్‌ను ఎన్నిసార్లయినా మార్చుకోవచ్చు. అయితే రైలు బయల్దేరడానికి 24 గంటల లోపున బోర్డింగ్ స్టేషన్ మార్చుకున్న పక్షంలో ప్రయాణికులకు రీఫండ్ మాత్రం రాదు.

యూపీఐ సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ, మార్చి 26: యూపీఐ సేవలకు అంతరాయం ఏర్పడడంతో బుధవారం దేశవ్యాప్తంగా డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలకు తీవ్ర అవరోధం ఏర్పడింది. డిజిటల్ చెల్లింపులు, నగదు బదిలీల్లో అవాంతరాలు ఎదుర్కొంటున్నట్టు యూజర్ల నుంచి ఫిర్యాదు లొచ్చాయి. దీనిపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) స్పందించింది. సాంకేతిక సమస్యల కారణంగా అంతరాయం ఏర్పడినట్టు తెలిపింది.

దక్షిణ కొరియాలో కార్చిచ్చు బీభత్సం

- 24 మంది మృతి, 26 మందికి తీవ్రగాయాలు

సియోల్: దక్షిణ కొరియాలోని దక్షిణ ప్రాంతాల్లో కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తున్నది. 200కుపైగా నిర్మాణాలు ధ్వంసం కాగా, 24 మంది మృతి చెందారు. 27వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కార్చిచ్చు ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో యూసియాంగ్ ఒకటి. ఇక్కడి మంటలను ఆర్పేందుకు వెళ్లిన ఓ హెలికాప్టర్ కూలిపోవడంతో పైలట్ మృతి చెందారు.

పట్టా ఉన్నా.. జాబ్ ఏదీ?!

- 83% ఇంజినీరింగ్ పట్టభద్రులకు 'నో' జాబ్స్
- 46 శాతం బిజినెస్ గ్రాడ్యుయేట్ల పరిస్థితీ ఇంతే
- అన్‌స్టాప్ రిపోర్ట్.. మోదీ పాలనలో ఇదీ దుస్థితి

ఇదీ నిరుద్యోగ భారతం

ఇంజినీరింగ్ పూర్తైనా జాబ్ దొరకనివారు:	83%
బిజినెస్ గ్రాడ్యుయేట్లలో జాబ్ లేనివారు:	46%
దేశంలో చదువుకు తగ్గ ఉద్యోగం చేయనివారు:	91.75 %
కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలు లేనివారు:	47%

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశంలో నిరుద్యోగం అంతకంతకూ పెచ్చరిల్లుతున్నది. ఉన్నత చదువులు పూర్తిచేసిన వారికి కూడా ఉపాధి అవకాశాలు లభించడం లేదు. ఇంజినీరింగ్ విద్య పూర్తిచేసిన 83 శాతం మందికి ఇంకా ఉద్యోగాలు లభించలేదని స్కిల్ డెవలప్‌మెంట్ కంపెనీ 'అన్‌స్టాప్' తాజాగా విడుదల చేసిన టాలెంట్ రిపోర్ట్-2025లో వెల్లడైంది. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ పూర్తి చేసిన 46 శాతం మందికి కూడా ఉద్యోగాలు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లు లభించ లేదని నివేదిక పేర్కొంది. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు లేకపోవడంతో పాటు ఉద్యోగ సంక్షోభం కూడా దీనికి కారణంగా నివేదిక అభిప్రాయపడింది.

యువతలో నైపుణ్యాల కొరత

దేశంలో చదువుకు తగ్గ ఉద్యోగాలు చేస్తున్న పట్టభద్రులు కేవలం 8.25 శాతం మంది మాత్రమేనని ఎకనమిక్ సర్వేలో తేలింది. మిగతా 91.75 శాతం మంది తమ చదువుకు తగ్గ ఉద్యోగాలు కాకుండా చిన్నాచితక పనుల్లో కొనసాగుతున్నట్టు ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలోని 47 శాతం మందిలో కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలు కొరవడినట్టు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) పేర్కొంది. యువతలో నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపట్టాల్సిన ఆవశ్యకతను ఐఎల్‌వో గుర్తు చేసింది.

అటకెక్కిన 'స్కిల్' లక్ష్యాలు

ఉపాధి అవకాశాల కోసం చూసే పట్టభద్రుల కోసం బీజేపీ ప్రభుత్వం 'స్కిల్ డెవలప్‌మెంట్' పేరిట కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. కార్మికులు, యువతలో నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో 2015లో మోదీ ప్రభుత్వం పీఎం కౌశల్ వికాస్ యోజన స్కీమ్‌ను కూడా తెరమీదకు తెచ్చింది. 2015లో 'స్కిల్ ఇండియా మిషన్'ను కూడా ప్రారంభించింది. అయితే, ఈ కార్యక్రమాలన్నీ ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యాయని, ఏ స్కీమ్ కూడా లక్ష్యాన్ని చేరుకోలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. లేకపోతే దేశంలో నిరుద్యోగం ఈ స్థాయిలో పెచ్చరిల్లే పరిస్థితులు ఉండేవి కాదని, యువతలో నైపుణ్యాలు పెరిగేవని చెప్తున్నారు. 'అన్‌స్టాప్' తాజా నివేదికను విశ్లేషిస్తే ఇది నిజమేనని అర్థమవుతున్నది.

పెరగనున్న డయాబెటిస్ ఔషధ ధరలు?

- క్యాన్సర్, గుండెజబ్బుల మందులు, యాంటీ బయాటిక్స్ ధరలు కూడా..
- 1.7 శాతం పెరిగే అవకాశం

న్యూఢిల్లీ, మార్చి 26: ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మందుల ధరలు త్వరలో పెరగనున్నాయి. వీటిలో క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులతోసహా ఇతర వ్యాధులకు సంబంధించిన ప్రభుత్వ నియంత్రిత మందులతోపాటు ఇతర యాంటీబయాటిక్స్ కూడా ఉన్నాయి. వీటి ధరలు 1.7 శాతం పెరిగే అవకాశం ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. మందుల తయారీకి ఉపయోగించే ముడిపదార్థాల ధరలు, ఇతర ఖర్చులు పెరుగుతున్న కారణంగా మందుల ధరల పెంపు ఫార్మసీ పరిశ్రమకు ఉపశమనం కలిగించగలదని అఖిల భారత కెమిస్టులు, డ్రగ్గిస్టు సంఘం(ఏఐఓసీడీ) ప్రధాన కార్యదర్శి రాజవీ సింఘాల్ తెలిపారు. కాగా, ఫార్మా కంపెనీలు అనుమతించిన ధరల పెంపు కన్నా అధికంగా మందుల ధరలు పెంచుతూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని రసాయనాలు, ఎరువుల అధ్యయనంపై ఏర్పడిన పార్లమెంటరీ స్థాయీ సంఘం వెల్లడించింది. ఫార్మా కంపెనీల ఉల్లంఘనలకు సంబంధించి 307 ఘటనలను ఫార్మా డ్రగ్స్ ధరలను ఖరారు చేసే నియంత్రణ సంస్థ నేషనల్ ఫార్మాస్యుటికల్ ప్రైసింగ్ అథారిటీ(ఎన్‌పీపీఏ) కనుగొంది. డ్రగ్ ప్రైసెస్(కంట్రోల్) ఆర్డర్(డీపీసీఓ), 2013 ప్రకారం ఫార్మసీ డ్రగ్స్‌కు ధరలపై గరిష్ఠ పరిమితి ఉంటుంది. తయారీ సంస్థలు ఈ ధరకు మించి ఉత్పత్తులను అమ్మరాదు.

'రా'పై ఆంక్షలు విధించాలి

ట్రంప్ సర్కారుకు యూఎస్ కమిషన్ సిఫార్సు

న్యూఢిల్లీ, మార్చి 26: భారత నిఘా సంస్థ రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా)పై ఆంక్షలు విధించాలని అంతర్జాతీయ మత స్వేచ్ఛపై ఏర్పాటైన యూఎస్ కమిషన్ సిఫార్సు చేసింది. విదేశాల్లోని సిక్కు వేర్పాటువాదులను హతమారుస్తున్నట్టు 'రా'పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆం క్షలు విధించాలని యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ ట్రంప్ ప్రభుత్వాన్ని కోరి ంది. మైనారిటీల పట్ల భారత్ వ్యవహరిస్తున్న తీరు అధ్వానంగా ఉన్నట్టు పేర్కొంది. అంతేకాకుండా మత స్వేచ్ఛా ఉల్లంఘనకు పాల్పడుతున్న భారత్‌ను 'ఆందోళన కలిగించే దేశం'గా ప్రకటించాలని కమిటీ అమెరికా ప్రభుత్వాన్ని కోరింది. ఈ నివేదికను భారత్ తీవ్రంగా ఖండించింది.

నాకు మళ్లీ జన్మనిస్తే తెల్లగా పుడతానా అమ్మా!

వర్ణవివక్షపై కేరళ సీఎస్ ఫేస్‌బుక్ పోస్ట్ వైరల్

తిరువనంతపురం: తన రంగు, లింగ వివక్షపై సమాజంలో తాను ఎదుర్కొన్న అవమానాల గురించి ఐఏఎస్ అధికారి, కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శారదా మురళీధరన్ చెప్పిన మాటలు సామాజిక మాధ్యమంలో చర్చకు దారితీశాయి. తన భర్త స్థానంలోనే అదే పదవిలో బాధ్యతలు చేపట్టిన తనకు తన భర్త రంగుతో పోలుస్తూ పలువురు కామెంట్లు పెట్టారని ఆమె తెలిపారు. దీనిపై భావోద్వేగంతో స్పందిస్తూ ఆమె ఫేస్‌బుక్ పోస్ట్ పెట్టారు. 'నా రంగు గురించి నేనేదో సిగ్గుపడాలి అన్నట్టు పోస్టులు పెట్టారు. నలుపును ఎందుకు అవమానించాలి. అది విశ్వమంతా ఉంది. అది లేనిదెక్కడ' అని ఆమె ప్రశ్నించారు. నాలుగేండ్ల వయసులో జరిగిన ఒక సంఘటనను ఆమె గుర్తుకు తెచ్చుకున్నారు. 'అమ్మా నన్ను తిరిగి గర్భంలోకి ప్రవేశపెట్టి తెల్లగా, అందంగా తీసుకరాగలవా?' అని తన తల్లిని ప్రశ్నించినట్టు చెప్పారు. 'ఈ నల్లని మేని ఛాయ వల్ల నేను ఎందుకూ పనికి రాని దానన్నే ఆత్మన్యూనతతోనే పెరిగాను. అయితే నా పిల్లల సహాయంతో దాని నుంచి బయటపడ్డా' అని తెలిపారు. సమాజం తన వైఖరులను మార్చుకుని, ఈ పక్షపాతం నుంచి బయటపడాల్సిన అవసరం ఉందని అన్నారు.

తప్పదోవ పట్టించే ప్రకటనలపై ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం

రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: తప్పుదోవ పట్టించే ప్రకటనలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. అవాస్తవ, అసహజ, అతిశయోక్తి విషయాలతో సమాజానికి తీవ్ర హాని కలిగించే తప్పుడు ప్రకటనలపై ఫిర్యాదు చేసేందుకు, వాటిని పరిష్కరించేందుకు తగిన యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. రెండు నెలల్లోగా ఆ వ్యవస్థను రూపొందించుకోవాలని స్పష్టంచేసింది.

సిద్దిపేట జిల్లా వంటిమామిడి సమీపంలో నరికివేసిన చెట్లు

పెద్ద సంఖ్యలో చెట్లను నరకడం మనుషులను చంపడం కన్నా ఘోరం

- 454 చెట్లను నరికిన వ్యక్తిపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం
- చెట్టుకు లక్ష చొప్పున జరిమానా

న్యూఢిల్లీ, మార్చి 26: పెద్ద సంఖ్యలో చెట్లను నరకడం మనుషులను చంపడం కన్నా ఘోరమని సుప్రీంకోర్టు బుధవారం అభిప్రాయపడింది. చట్టవిరుద్ధంగా నరికిన ప్రతి చెట్టుకు లక్ష రూపాయల చొప్పున జరిమానా చెల్లించాలని ఓ వ్యక్తిని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. రక్షిత తాజ్ చతుర్భుజ జోన్‌లో 454 చెట్లను నరకివేసిన వ్యక్తి దాఖలు చేసిన అప్పీలును జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. పర్యావరణానికి సంబంధించిన విషయంలో క్షమాభిక్ష ప్రసక్తి ఉండరాదని, పెద్ద సంఖ్యలో చెట్లను నరకివేయడం మనుషులను చంపడం కన్నా ఘోరమని ధర్మాసనం అభిప్రాయపడింది. 454 చెట్లు కల్పించే పచ్చదనాన్ని తిరిగి సృష్టించడానికి కనీసం 100 సంవత్సరాలు పడుతుందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మథుర-బృందావన్‌లోని దాల్మియా వ్యవసాయ క్షేత్రంలో 454 చెట్లను నరికివేసిన శివశంకర్ అగర్వాల్ అనే వ్యక్తికి చెట్టుకు రూ.1 లక్ష చొప్పున జరిమానా విధించాలన్న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ(సీఈసీ) నివేదికను సుప్రీంకోర్టు ఆమోదించింది. సమీపంలోని స్థలంలో అగర్వాల్ మళ్లీ చెట్లను నాటాలని, ఆయనపై దాఖలైన కోర్టు ధిక్కార కేసును ఆ తర్వాతే కొట్టివేస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

రేప్‌పై జడ్జి వ్యాఖ్యలు అమానవీయం

ఏమాత్రం సున్నితమైనవి కాదు.. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, మార్చి 26: వక్షోజాలను పట్టుకోవడం, పైజామా తాడును లాగడం అత్యాచారం కిందకు రాదని వ్యాఖ్యానిస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు బుధవారం స్టే ఇచ్చింది. హైకోర్టు న్యాయమూర్తి తీర్పులో సున్నితత్వం లోపించిందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తీర్పులోని కొన్ని వ్యాఖ్యలు తమను బాధించాయని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ మాసిహ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఈ వ్యవహారంపై కేంద్రం, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి సమాధానాలను సుప్రీం కోరింది. తీర్పు రాసిన రచయితలో సున్నితత్వం పూర్తిగా లోపించిందని చెప్పడానికి తాము బాధపడుతున్నామని ధర్మాసనం తెలిపింది. ఇది హడావుడిగా ఇచ్చిన తీర్పు కూడా కాదని, నాలుగు మాసాలపాటు రిజర్వ్‌లో ఉంచిన తర్వాత ఇచ్చిన తీర్పని వారు తెలిపారు. ఈ దశలో స్టే ఇవ్వడం తమకు ఇష్టం లేదని, అయితే 21, 24, 26 పేరాగ్రాఫ్‌లలో ఉన్న కొన్ని వ్యాఖ్యలు చట్టానికి కొత్తవని, అమానుషంగా ఉన్నాయని, అందుకే తాము తీర్పుపై స్టే ఇస్తున్నామని ధర్మాసనం వెల్లడించింది. ధర్మాసనం అభిప్రాయంతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా ఏకీభవించారు.

హైకోర్టు జడ్జి తీర్పులో సున్నితత్వం పూర్తిగా కొరవడిందని జస్టిస్ గవాయ్ అన్నారు. సమన్లు జారీ చేసే అంశమని, న్యాయమూర్తిపై ఇటువంటి కఠినమైన పదాలు ఉపయోగిస్తున్నందుకు తమను క్షమించాలని తెలిపారు. మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో అలహాబాద్ హైకోర్టు తీర్పును "వి ద వుమెన్ ఆఫ్ ఇండియా" అనే సంస్థ చేసిన విమర్శలను సుమోటోగా సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. బాధితురాలి తల్లి కూడా అత్యున్నత న్యాయస్థానంలో అప్పీలు చేయగా సుమోటో కేసులో దాన్ని కూడా కోర్టు చేర్చింది. తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు తీర్పు మార్చి 17న వెలువడింది. జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా ఈ తీర్పు ఇచ్చారు. అత్యాచార నేరానికి సంబంధించిన ఐపీసీలోని సెక్షన్ 376 కింద తనకు కింది కోర్టు సమన్లు జారీచేయడాన్ని సవాలు చేస్తూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి ఈ తీర్పు ఇచ్చారు. నిందితులు పవన్, ఆకాశ్ బాధితురాలి వక్షోజాలను పట్టుకుని ఆమె పైజామాను కిందకు లాగడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో ఆమె పైజామా తాడును నిందితులు తెంచేశారు. బాలికను కాలువ కిందకు లాక్కెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా సాక్షులు జోక్యం చేసుకోవడంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయినట్టు అభియోగాలు నమోదయ్యాయి. నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఈ వాస్తవాలను బట్టి చూస్తే బాధితురాలిపై అత్యాచారం చేయాలన్న ఉద్దేశం నిందితులకు ఉన్నట్టు నిర్ణయించలేమని అన్నారు. ఇంతకు మించి బాధితురాలిపై అత్యాచారం జరిపేందుకు నిందితులు వేరే ఏ రకమైన చర్యలకు పాల్పడలేదని హైకోర్టు తీర్పులోని 21వ పేరా పేర్కొంది. దీన్నే ఇప్పుడు సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణిస్తోంది.

భూగర్భ క్షిపణి నగరం!

నిర్మించిన ఇరాన్

టెహ్రాన్: ఇరాన్ అండర్‌గ్రౌండ్ మిస్సైల్ సిటీని ఆవిష్కరించింది. ఒక పక్క అణు కార్యక్రమాలను నిలిపివేయాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన డెడ్‌లైన్‌ను బేఖాతరు చేస్తూ తమ ఆయుధ సామర్థ్యాన్ని తెలిపే వీడియోను ఇరాన్ విడుదల చేసింది. ఇరానీ రివల్యూషనరీ గార్డ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటై, క్షిపణి నగరంగా పిలిచే ఈ స్థావరంలో విస్తృతమైన భూగర్భ సొరంగాలు ఉన్నాయి. దీనికి సంబంధించిన వీడియోలో టాప్ మిలటరీ కమాండర్లు సొరంగ మార్గంలో వాహనంపై ప్రయాణిస్తూ క్షిపణి కేంద్రాన్ని పరిశీంచడం కన్పించింది.

హమాస్ వైదొలగాలి

- మాకీ యుద్ధం వద్దు
- నినదించిన పాలస్తీనా పౌరులు
- గాజాలో పెద్ద ఎత్తున నిరసన

కైరో, మార్చి 26: గత 17 నెలలుగా యుద్ధంతో శిథిలమైన గాజా స్ట్రిప్‌లో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఒక పక్క వేలాది మంది మరణం, మరో పక్క ఆస్తుల ధ్వంసం, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు పరుగులు.. వీటితో కొన్ని నెలలుగా విసిగి వేసారిన పాలస్తీనియన్లు యుద్ధానికి ముగింపు పలికి, అధికారం నుంచి తొలగాలని హమాస్ మిలిటెంట్లపైనే నిరసనకు దిగారు. 2007 నుంచి తమను పాలిస్తున్న హమాస్ మిలిటెంట్లకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాలస్తీనియన్లు భారీ నిరసన ప్రదర్శన చేశారు. యుద్ధం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఉత్తర ప్రాంత పట్టణం బీట్ లేహియాలో వందలాది మంది నిరసనకారులు ప్ల కార్డులు చేతబట్టి హమాస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యాల వీడియోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. మాకీ యుద్ధం వద్దు, మేము చావాలనుకోవడం లేదు. మా పిల్లల రక్తం చవక కాదు అంటూ ప్ల కార్డులు ప్రదర్శిస్తూ.. హమాస్ వైదొలగాలి అంటూ నినాదాలు చేశారు.

డ్రాపౌట్ చాయ్‌వాలా!

మెల్‌బోర్న్, మార్చి 26: విదేశాల్లో తన చాయ్ సామ్రాజ్యాన్ని స్థాపించి సక్సెస్ అయిన యువకుడి విజయ గాథ ఇది. కాలేజీ వీడి మరీ చాయ్ స్టార్టప్ మొదలుపెట్టిన ఆ విద్యార్థి పేరు సంజీత్ కొండా. తన నేపథ్యానికి తగ్గట్టుగా ఔట్‌లెట్‌కు డ్రాపౌట్ చాయ్‌వాలా అని పేరుపెట్టాడాయన.

డ్రాపౌట్ చాయ్‌వాలా నేపథ్యం...

బెంగళూరుకు చెందిన సంజీత్ ఉన్నత చదువుల కోసం 2018లో ఆస్ట్రేలియాకు వెళ్లారు. తన ముగ్గురు స్నేహితులతో కలిసి సంజీత్ స్టార్టప్‌కు రూపకల్పన చేశారు. 2021లో రూ.18 లక్షలు పెట్టుబడి పెట్టి మెల్‌బోర్న్‌లోని ఎలిజబెత్ స్ట్రీట్‌లో తొలి ఔట్‌లెట్‌ను ప్రారంభించారు. ఈ స్టార్టప్‌కు వినూత్నంగా డ్రాపౌట్ చాయ్‌వాలా అని పేరు పెట్టి అందరి దృష్టిని ఆకర్షించారు. స్టార్టప్ సక్సెస్ అవడంతో 2023 మార్చిలో 'మొబైల్ టీ ట్రక్'ను మొదలుపెట్టారు. అనంతరం ఆగస్టులో లా ట్రోబ్ స్ట్రీట్‌లో మరో ఔట్‌లెట్‌ను ప్రారంభించారు. ఇలా డ్రాపౌట్ చాయ్‌వాలా ద్వారా 40 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

దేశాన్ని వీడుతాం!

- వలస బాటలో 22% మంది సంపన్నులు
- 'కొటక్ ప్రైవేట్' తాజా సర్వేలో వెల్లడి

22% దేశాన్ని వీడాలనుకుంటున్న సంపన్నులు

25 లక్షలు ఏటా విదేశాలకు వలసపోతున్న భారతీయులు



న్యూఢిల్లీ, మార్చి 26: భారతీయ సంపన్నుల్లో దాదాపు 22% శాతం మంది స్వదేశాన్ని వీడాలనుకుంటున్నారు. వీరంతా మెరుగైన జీవన పరిస్థితులు, నాణ్యమైన జీవన ప్రమాణాలు, సులభమైన వ్యాపార వాతావరణం ఉన్న విదేశాలకు వలసపోవాలనుకుంటున్నట్టు తాజా సర్వేలో తేలింది. భారత్‌లో లీడింగ్ వెల్త్ మేనేజర్‌గా కొనసాగుతున్న 'కొటక్ ప్రైవేట్' సంస్థ ప్రముఖ కన్సల్టెన్సీ 'ఈవై' (ఎర్నెస్ట్ యంగ్)తో కలిసి దేశంలోని అత్యంత సంపన్నులైన 150 మందిపై ఈ సర్వే నిర్వహించింది.

ప్రతి 5 మందిలో ఒకరు..

భారత్‌లోని ప్రతి ఐదుగురు ధనికుల్లో ఒకరు ప్రస్తుతం విదేశాలకు వలసవెళ్లాలన్న యోచనలో ఉన్నారని, వారిలో ఎక్కువ మంది భారత పౌరసత్వాన్ని నిలబెట్టుకుంటూనే తమకు నచ్చిన ఆతిథ్య దేశంలో శాశ్వతంగా నివసించాలని భావిస్తున్నారని సర్వేలో తేలింది.

ఏ దేశాలకు వలస?

ఎక్కువ మంది అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా లాంటి దేశాలతోపాటు గోల్డెన్ వీసా పథకాన్ని అమలు చేస్తున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో స్థిరపడాలనుకుంటున్నట్టు సర్వేలో వెల్లడైంది.

దేశాన్ని వీడటానికి కారణం?

భారత్‌ను వీడాలనుకుంటున్న సంపన్నులు మెరుగైన జీవన ప్రమాణాలతో పాటు నాణ్యమైన విద్య, వైద్య, ఆరోగ్య సంరక్షణ సదుపాయాలను, మెరుగైన జీవనశైలిని కోరుకుంటున్నట్టు ఈ సర్వేలో తేలింది. వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేసుకోవాలన్న ప్రధాన ధ్యేయంతో విదేశాలకు వలసపోవాలనుకుంటున్నట్టు ఈ సర్వేలో మూడింట రెండొంతుల మంది సంపన్నులు స్పష్టం చేశారు.